క్లుప్తంగా

35 మందికి దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఖానాపూర్: మండలంలోని కోలాంగూడ గ్రామానికి చెందిన 35 మంది ఆదివాసీలకు సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. శుక్రవారం ఎర్వచింతల్ గ్రామ పాఠశాల ఆవరణలో ట్రస్టు సభ్యులు వారికి దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో భీంసింగ్, నర్సారెడ్డి, రత్నాకర్‌రావు, వాల్‌సింగ్, గోపాల్, రవీందర్ తదితరులున్నారు.

నేటి నుంచి సీపీఎం మహాసభలు

దస్తురాబాద్: సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు దుర్గం శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బుట్టాపూర్‌లో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈసభలకు పొలిట్‌బ్యూరో సభ్యులు బృందకారత్, బి.వి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, వీరయ్య అతిథులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, వెంకటేశ్, నర్సయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో పోటీలు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో డివిజన్ స్థాయి క్రికెట్, ఖోఖో పోటీలతోపాటు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన కాశీనాథ్ బచ్చువార్ జ్ఞాపకార్థం శివశంకర్ కిరాణ, ఫర్టిలైజర్ సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కోఆర్డినేటర్ ఓంప్రకాష్ 91770 55585, ప్రిన్సిపాల్ 99633 08287 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఐడీఏ నూతన కార్యవర్గం



ఎన్నికైన ఐడీఏ కార్యవర్గం

నిర్మల్‌టౌన్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నిర్మల్‌లోని తమ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.నరసింహస్వామి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కె.సంజీవ్‌కుమార్ (భైంసా), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వెంకటరమణ (నిర్మల్) కోశాధికారిగా డాక్టర్ కె.నరేష్ (నిర్మల్) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని డాక్టర్లు సన్మానించారు.

ఖేల్ ఉత్సవ్ క్రీడా పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట ఆలయ ప్రాంగణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఖేల్ ఉత్సవ్ క్రీడా పోటీలు శుక్రవారం కొనసాగాయి. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచలాక్ నూకల విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఏబీవీపీ నాయకులు గంగిశెట్టి ప్రేమ్ కుమార్, శశిధర్, చంద్రగిరి శివకుమార్, దినేశ్, వంశీ, జగదీశ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సంతోష్



కుభీర్: ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన రెడిశెట్టి సంతోష్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు విలాస్ గాదేవార్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల సాయినాథ్, కోశాధికారిగా శ్రీశైలం ఎన్నికయ్యారు.

'రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి'

సోన్: సోన్, మాదాపూర్, కడ్తాల్ క్లస్టర్ల పరిధిలో సాగు భూమి కల్గి గతంలో రైతుబంధు పొందనివారు, 2025 జనవరి ఒకటో తేదీలోగా భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి రైతు భరోసాకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శుక్రవారం ఏఈఓలు ఉమామహేశ్వరి, ప్రగతి, అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతుభరోసా ఫారం నింపి, పట్టా పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్‌లను ఏఈఓలకు అందించాలని కోరారు. ఐకేపీ మండలాధ్యక్షురాలు సరిత, రైతులు వేణు, దినేశ్ తదితరులు ఉన్నారు.

సంవిధాన్ గౌరవ్ అభియాన్

భైంసాటౌన్: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో భారత సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాత్ర, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, రావుల పోశెట్టి, వెంకటేశ్, కాసర్ల ప్రవీణ్, కన్నయ్య తదితరులున్నారు.

ముగిసిన గ్రామసభలు

- చివరిరోజు అక్కడక్కడా నిరసనలు
- అర్హులకు పథకాలు అందించాలని అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం



కుభీర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీవో మోహన్‌సింగ్

ముథోల్: ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులకు లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు మండలంలోని ఆష్టా, రువ్వి, చించాల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆష్టా, చించాల గ్రామసభల్లో గందరగోళం ఏర్పడింది. జాబితాలో అనర్హులను చేర్చడంతో గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. వారికి అధికారులు నచ్చజెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఎస్సై సంజీవ్ తదితరులున్నారు.

సారంగాపూర్: మండలంలోని తాండ్ర(జి), బీరవెల్లి, బోరిగాం, జామ్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా మారాయి. లబ్ధిదారుల జాబితాలో అర్హులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జామ్ గ్రామసభలో మాట్లాడుతూ ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు అర్హులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో శాంతించారు. అనంతరం పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఏపీఓ లక్ష్మారెడ్డి, అధికారులు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామసభలో అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న జాబితాలో కేవలం 72 మంది పేర్లు మాత్రమే వచ్చాయని.. మిగతా వారి పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. కన్కపూర్, లోకేశ్వరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో వెంకటరమేశ్, సోలమాన్ రాజ్, ఏఈలు ఉన్నారు.

బాసర: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీడీవో అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం బాసర పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి పథకాలకు అర్హుల జాబితాను చదివి వినిపించారు. పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు.. గ్రామస్తులకు నచ్చజెప్పారు. సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్, తహసీల్దార్ పవన్ చంద్ర, ప్రత్యేకాధికారి రమణ, వ్యవసాయాధికారి శ్రీకర్, డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో గంగాసింగ్, ఏపీవో సదానందచారి పాల్గొన్నారు.

తానూరు: తమ పేర్లు జాబితాలో రాలేదని మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏవో మనీషా మాట్లాడుతూ పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జలాంసింగ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తామని ఎంపీవో మోజంహుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుంక్లి, పేండ్‌పెల్లి, హంపోలి, చింతల్‌బోరి, దేగాం, ఇలేగాం, కామోల్ గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంతోపాటు గుండంపల్లి, సముందర్‌పల్లిలో గ్రామసభలు నిర్వహించారు. తమకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజలు అధికారులను నిలదీశారు. తహసీల్దార్ బి.స్వాతి, ఎంపీడీఓ అరుణారాణి, ఎంపీవో గోవర్ధన్, సంతోష్, ఏపీవో దివ్యారెడ్డి పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ప్రజాసంక్షేమ పథకాలకు అర్హుల జాబితాను చదివి విన్పించారు. అనంతరం పలువురు రేషన్‌కార్డులో మార్పులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తు చేసుకొన్నారు. సభలో ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, తహసీల్దార్ అశోక్‌మార్, ఈవో గౌతమ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



బాసరలో మాట్లాడుతున్న ఎంపీడీవో అశోక్

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే), రాచాపూర్ గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. పొట్టపల్లి(కే) గ్రామసభలో ఎంపీడీవో రాధ మాట్లాడారు. అర్హులుగా ఉన్నప్పటికీ నాలుగు సంక్షేమ పథకాలు అందించే జాబితాలో పేర్లు రాకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీవో అమీర్‌ఖాన్, ఎస్సై సుమలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ వార్డుసభలో పాల్గొన్నారు. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 0అడ్వ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, కోలాంగూడ గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిలదీతల మధ్యకొనసాగాయి. ఎర్వచింతల్‌లో సర్వే తీరు, పథకాల అమలుపై ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హుల పేర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులను తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీవో రత్నాకర్‌రావు హామీ ఇచ్చారు.

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట, మున్యాలతండా గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్, ఎంపీడీవో రమేశ్ మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేనివారు నిరాశ చెందకుండా పంచాయతీ కార్యదర్శికి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీవో రమేశ్ రెడ్డి, ఆర్ఐ గంగన్న, ఏఈవో తిరుపతి, కిరణ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లోని భాగ్యనగర్ వార్డుసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్మన్ ఈశ్వర్



దిలావర్‌పూర్‌లో మాట్లాడుతున్న అధికారులు



లోకేశ్వరం గ్రామసభలో జాబితా చదువుతున్న అధికారి సోలమాన్ రాజ్



తానూరు గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎంఏ జబ్బార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28 వరకు, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఫిబ్రవరి 10వరకు గడువు ఉందన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లకుగాను 60 మైనార్టీలకు, 10 బీసీ, 05 ఎస్సీ, 03 ఎస్టీ, 02 ఓసీలకు రిజర్వేషన్ ఉంటుందని, అలాగే ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 40 చొప్పున 80 సీట్లకు మైనార్టీలకు 60, 20 ఇతరులకు కేటాయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 96031 79180(పాఠశాల), 99121 35636(కళాశాల)నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు వినతి

సోన్: మండలంలోని సాకెర గ్రామసభలో గురువారం ఎఫ్ఏ శ్రీనివాస్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐకేపీ సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆత్మీయ భరోసా పథకం జాబితాలో తమ పేర్లు రాలేవని కొందరు ఎఫ్ఏ శ్రీనివాస్‌పై దాడి చేశారని వివరించారు. కార్యక్రమంలో సోన్ ఏపీఓ మంజుల, ఈసీ, టీఏ, ఎఫ్ఏలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అధికారులు సమయపాలన పాటించకపోవడంతో చెడ్డపేరు'

కుంటాల: గ్రామసభలకు వచ్చేందుకు అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని జెడ్పీ మాజీ చైర్మన్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల గ్రామసభలో అధికారులను ప్రశ్నించారు. సభా వేదికలు ఏర్పాటు చేసి అధికారులు ఆర్భాటం చేస్తున్నారని మాజీ ఎంపీపీ గజ్జారాం పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకండి దత్తాద్రి కోరారు. పేదలకు న్యాయం చేయాలని దొనికెన వెంకటేశ్ కోరారు. మిగతా గ్రామాల్లో గ్రామసభలు ఉండడంతో అధికారులు ఆలస్యంగా వచ్చారని.. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని డీపీవో శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

పంటను మార్కెట్‌లోనే అమ్ముకోవాలి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

కుభీర్: రైతులు తాము పండించిన పంటను దళారులకు విక్రయించకుండా మార్కెట్‌లోనే అమ్ముకొని మద్దతు ధర పొందాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం కుభీర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఆయా పార్టీల నాయకులు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. దొడర్నా, తానూరు మండలంలోని ఇప్పనెల్లి చెరువులకు నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ కార్యాలయం ఎదుట, వివేకానంద చౌరస్తా నుంచి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎకరాకు మూడు క్వింటాళ్ల పంటను కొనుగోలు చేస్తున్నామని.. వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి దీనిని మరింత పెంచుతానని పేర్కొన్నారు. 12శాతం తేమ కల్గిన పంటను రూ.7,550 మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మాజీ మండలాధ్యక్షుడు సావుల మల్లన్న, బోయిడి విఠల్, వి.నాగేశ్, కమ్లేశ్, మాజీ ఎంపీటీసీ మోహన్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, నాయకులు బంక బాబు, దత్తాత్రి, గులాబ్, కనకయ్య, వైద్యనాథ్, నర్సప్ప, బషీర్, మార్కెట్ కార్యదర్శి గంగాధర్, క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.



కుభీర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్

ఆందోళన చెందవద్దు..

తానూరు: జాబితాలో పేర్లు రాలేదని ఆందోళన చెందవద్దని.. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మొగ్లి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం రూ.3 లక్షలతో చేపట్టే సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లింగంమూర్తి, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, చిన్నారెడ్డి, శివాజీపటేల్, మాజీ సర్పంచ్ పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. పట్టణంలో రోడ్డువిస్తరణ, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యతోపాటు డబుల్ బెడ్‌రూం కాలనీలో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించామన్నారు. అనంతరం చెత్తతరలింపు వాహనాలను ప్రారంభించి.. మాల సంక్షేమ సంఘం, కేఎస్‌ఆర్ కళాశాల, సత్యం డిపోకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను వేర్వేరుగా ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు చేయాలని మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం శివాజీనగర్ కాలనీలో జర్నలిస్టు దేవేందర్ సోదరి రమణమ్మ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇంద్రనగర్, సుభాశ్‌నగర్‌కు వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సంకీర్తన, విజయలక్ష్మి, స్రవంతి, పరిమిలత, అఫ్రినాబేగం, కిశోర్‌నాయక్, ఖలీల్, దయానంద్, రమేశ్ తదితరులున్నారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ముగిసిన జాతర

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన జాతర ముగిసింది. సమీప గ్రామాలతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల ప్రజలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మల్లయోధులకు కుస్తీపోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిగా రూ.9,999 వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.5,555 నగదును బహుకరించి సన్మానించారు. గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న మల్లయోధులు

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వరల్డ్ విజన్, బాలికల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. సభ్యులు అనిల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. లక్ష్మణచాంద అంగన్‌వాడీ కేంద్రంలో స్మార్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలిక దినోత్సవం నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం–చదివిద్దాం అనే నినాదంతో ముందుకెళ్లాలని పలువురు పేర్కొన్నారు. సంస్థ సభ్యుడు శివశంకర్, హెచ్ఎం సాయికృష్ణ, వరల్డ్ విజన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, హనుమన్న ఉన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కడెం: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా శుక్రవారం కడెంలో ఈడీఐఐ యాక్సెంచర్ ఆధ్వర్యంలో 26 రోజులు శిక్షణ పొందిన మహిళలు ఏర్పాటు చేసిన సీఎఫ్‌సీ సెంటర్ ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకంలో భాగంగా చేప వంటకాల విక్రయ సంచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసెంటర్‌తో మహిళలు చేపల పచ్చడి, రొయ్యల పచ్చడి, ఎండు చేపల విక్రయాలు జరపాలని పేర్కొన్నారు. ఎంపీడీవో అరుణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్, రమేశ్, లచ్చన్న, ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ దేవేందర్ నాయక్ తదితరులున్నారు.

అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు

లోకేశ్వరం: వాహనాలు అతివేగంగా నడపడం ద్వారానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ముథోల్ సీఐ మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పంచగుడి వంతెన వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మల్లేశ్ మాట్లాడుతూ 25 వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు సరిగాలేని వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ మల్లేశ్

బకాయిలు విడుదల చేయాలని భిక్షాటన

సారంగాపూర్: ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఉపకార వేతనాలు, కళాశాలలకు ఫీజు బకాయిలను చెల్లించాలని మండల కేంద్రంలోని పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం శుక్రవారం భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేశారు. కాకతీయ యూనివర్శిటీ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఈసీ మెంబర్ అహ్మద్‌పాషా మాట్లాడుతూ మూడేళ్లుగా విద్యార్థుల ఉపకారవేతనాలు, కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

'మాకు సర్వీస్ రోడ్డు కావాలి'

నిర్మల్‌టౌన్: మా గ్రామానికి సర్వీస్ రోడ్డు నిర్మించాలని సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామస్తులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్‌హెచ్–44 పక్కనున్న కడ్తాల్ గ్రామం వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణంతో గ్రామంలోని సర్వీస్ రోడ్డుపై నుంచే నిర్మల్‌కు వాహనాలు వెళ్తున్నాయని పేర్కొన్నారు. న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి, నూతన్‌కుమార్, కృష్ణవేణి, రామ్ లక్ష్మణ్, రాజు, ఎంసీ లింగన్న తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భైంసాటౌన్: గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి మురళీగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆ సంఘ భవనంలో గౌడసంఘం నూతన సంవత్సర కాలెండర్ ఆవిష్కరించారు. పట్టణాధ్యక్షుడు రాములుగౌడ్, తానూరు మండలాధ్యక్షుడు మోహన్‌గౌడ్, రమేశ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

భైంసాటౌన్: కుభీర్ మండలం పార్డి(బి)లో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్‌ను తన నివాసంలో కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. గ్రామపెద్దలు విజయ్, రమేశ్, సుభాశ్, కాశీనాథ్, మాజీ సర్పంచ్ రాజన్న, రాజలింగు, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన

మామడ: రాజ్యాంగాన్ని చదివి అవగాహన పెంచుకోవాలని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి నూనెల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక, ఆదేశిక సూత్రాలపై అవగాహన కల్పించారు. కృష్ణకిశోర్, మాధవి, గిరిధర్, దినేశ్ పాల్గొన్నారు.

మాక్‌పోలింగ్

లక్ష్మణచాంద: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని కనకాపూర్ అక్షర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి హాజరై ఓటు హక్కు గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్లు నరేశ్‌రెడ్డి, రాజారెడ్డి, ప్రిన్సిపాల్ సునంద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్‌పాం సాగుపై అవగాహన

కుంటాల: మండలంలోని ఓలా రైతువేదికలో శనివారం ఉదయం 9 గంటలకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు మండల క్లస్టర్ ఆఫీసర్ అముదారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలి'

ఖానాపూర్: గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలని అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు మేస సతీశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. దామోదర్, శిరీశ్ ఉన్నారు.



వట్టోలిలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు



ధర్మోరలో నాటు వేస్తున్న కూలీలు



ధర్మోరలో పగటి బువ్వ తింటున్న మహిళలు

జోరుగా వరినాట్లు

లోకేశ్వరం: యాసంగి వరినాట్లు జోరందుకున్నాయి. వానాకాలంలో ఎక్కువ వర్షాలు కురువడంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో ఈసారి జిల్లాలో లక్ష 20వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల వరినాట్లు పూర్తవగా.. మరికొన్ని చోట్ల పనులు సాగుతున్నాయి. లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు వేస్తున్న దృశ్యాలివీ.